కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -182 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 14-07-2026 | మంగళవారం | పేజీలు : 4



# తెలంగాణలో 7 ఈఎస్ఐసీ ప్రాజెక్టులు

- రూ.668 కోట్ల భారీ ప్రాజెక్టులు
- సనత్‌నగర్ నుంచే ప్రారంభం
- 53 లక్షల మందికి లబ్ధి
- కొత్త ఓపీడీ సేవలు
- కార్మికులకు మెరుగైన వైద్యం
- 33 జిల్లాలకు ఈఎస్ఐ సేవలు
- మాండవీయ చేతుల మీదుగా ప్రారంభం

**న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్):** తెలంగాణ వేదికగా దేశవ్యాప్తంగా కార్మిక సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఊతం ఇవ్వనుంది. నగరంలోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి నుంచి దేశవ్యాప్తంగా రూ.668 కోట్ల వ్యయంతో చేపట్టిన 7 కీలక ఆరోగ్య ప్రాజెక్టులను జూలై 14న కేంద్ర కార్మిక-ఉపాధి, యువజన వ్యవహారాలు-క్రీడా శాఖల మంత్రి డా.మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 53 లక్షల మంది ఈఎస్ఐ లబ్ధిదారులకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి తెలంగాణలోని హైదరాబాద్ సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి ప్రధాన కేంద్రంగా నిలవనుంది.

మిగతాది 2 లో..


# నామినేటెడ్ పదవులపై తుది కసరత్తు

- మీనాక్షి సమక్షంలో కీలక భేటీ
- పనితీరు ఆధారంగా నియామకాలు
- ఒక్కో పదవికి 10 మంది పోటీ
- చైర్మన్ పోస్టుల కోసం లాబీయింగ్
- రెన్యువల్‌పై త్వరలో నిర్ణయం


2 లో

**న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్):** నామినేటెడ్ పదవుల విషయంలో ఎవరికి రెన్యువల్ చెయ్యాలి? ఎవరిని పక్కన పెట్టాలి? కొత్తగా ఎవరికి అవకాశం ఇవ్వాలి? అనే అంశంపై పార్టీ, ప్రభుత్వ పెద్దల్లో పెద్ద ఎత్తున చర్చోప చర్చలు జరుగుతున్నాయి. పనితీరు ఆధారంగా నియామకాలు జరపాలని భావిస్తోన్న సీఎం రేవంత్.. పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమక్షంలో తుది నిర్ణయం తీసుకునే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

# టీజీ టెట్ ఫలితాల విడుదల



2 లో

- 43.94 శాతం మంది అర్హత సాధింపు
- 50,544 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులు
- జూలై 21న ప్రత్యేక టెట్ నోటిఫికేషన్

# కాంగ్రెస్‌పై పోరుకు సిద్ధం

- హరీశ్‌రావు పాదయాత్ర ప్రకటన
- బసవేశ్వర నుంచి సంగమేశ్వర వరకు
- ప్రాజెక్టుల నిలిపివేతపై ఆగ్రహం
- ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు
- రాష్ట్ర రాజకీయాల్లో హీట్


2 లో

**న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్):** తెలంగాణ రాజకీయాల్లో మరో ఉత్కంఠభరిత పరిణామానికి తెరలేచింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రాజెక్టుల నిలిపివేతను నిరసిస్తూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సంచలన ప్రకటన చేశారు. త్వరలోనే తాను క్షేత్రస్థాయిలోకి వెళ్లనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా 'బసవేశ్వర నుండి సంగమేశ్వర' వరకు భారీ పాదయాత్ర చేపట్టబోతున్నట్లు హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ యాత్ర ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను జనాల్లోకి తీసుకెళ్లి ఎండగట్టడమే తన అజెండా అని ఆయన ప్రకటించారు.

ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న తీరుపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# ఇరాన్ హిట్‌లిస్టు!


2 లో

- 13 మంది నేతలతో ఇరాన్ 'రివేంజ్ లిస్ట్'
- ట్రంప్, నెతన్యాహు పేర్లు జాబితాలో
- పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ ఉద్రిక్తతలు
- అమెరికా-ఇరాన్ పరస్పర దాడులు
- హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్త పరిస్థితులు
- దౌత్య చర్చలు విఫలమయ్యాయని టెహ్రాన్ ఆరోపణ

# అయోధ్య విరాళాల కేసులో కీలక మలుపు


2 లో

- కేంద్రం, యూపీకి సుప్రీం నోటీసులు
- ట్రస్ట్‌కు సమాధానం ఇవ్వాలన్న ఆదేశం
- సిట్ స్టేటస్ రిపోర్టు సమర్పించాలి
- నిధుల దుర్వినియోగంపై విచారణ
- జూలై 20కి తదుపరి విచారణ

# తెలంగాణకు సుప్రీంలో ఎదురుదెబ్బ



2 లో

- పిటిషన్‌లో సాంకేతిక లోపాలు
- స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరణ
- ఏపీకి నోటీసులపై స్పష్టత
- లోపాలు సరిచేయాలని ఆదేశం
- తదుపరి విచారణ వాయిదా

**న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్):** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పోలవరం ప్రాజెక్టు, కృష్ణా నీటి వినియోగం, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ అంశాలపై తెలంగాణ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. అయితే ఈ విచారణలో తెలంగాణ ప్రభుత్వానికి న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ..

# తమిళనాడు ప్రభుత్వానికి ఊరట

- హైకోర్టు ఉత్తర్వులకు సుప్రీం స్టే
- గోవధ కేసులో కీలక మలుపు
- ప్రతివాదులకు నోటీసులు జారీ
- చట్ట నిబంధనలపై ప్రభుత్వ వాదన
- తదుపరి ఉత్తర్వుల వరకు స్టే కొనసాగింపు

2 లో

# ఆరు హత్యల కేసులో కీలక పరిణామం

- నిందితుడు రాజ్‌కుమార్ మృతి
- పాయిజన్ తాగి ఆత్మహత్య?
- పంజర్ల శివారులో మృతదేహం
- 12 బృందాల గాలింపుకు ముగింపు
- రూ.2 లక్షల రివార్డు ప్రకటన


2 లో

# మమతకు కోర్టు షాక్

- రితబ్రత వర్గానికి ఊరట
- అసలైన టీఎంసీగా గుర్తింపు
- కార్యాలయాలు, నిధులపై హక్కు
- ఈసీకి తీర్పు కాపీ
- టీఎంసీలో కొత్త మలుపు


2 లో

**న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్):** పశ్చిమ బెంగాల్‌లో మాజీ సీఎం మమతా బెనర్జీకి షాక్ తగులగా, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) చీలికవర్గానికి న్యాయస్థానంలో గొప్ప ఊరట లభించింది. రెబల్ నేత రితబ్రత వర్గాన్నే తృణమూల్ కాంగ్రెస్ ఏకైక చట్టబద్ధమైన విభాగంగా గుర్తిస్తూ అలీపూర్ కోర్టు తీర్పు చెప్పింది. జూన్ 22న జాతీయ కార్యవర్గ సమావేశంలో ఏర్పాటు చేసిన కమిటీయే పార్టీకి సంబంధించిన ఏకైక చట్టబద్ధమైన విభాగమని తీర్పు చెబుతూ.. ఆ వర్గానికే పార్టీ కార్యాలయాలు, నిధులపై నియంత్రణ కల్పిస్తున్నట్లు పేర్కొంది.

తమదే అసలైన పార్టీ విభాగంగా గుర్తిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు పట్ల రితబ్రత ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# పోలవరం పూర్తిపై సీఎం కీలక వ్యాఖ్యలు

- పుష్కరాలకల్లా పోలవరం పూర్తి
- ధవళేశ్వరం పనులకు శ్రీకారం
- 2021లోనే పూర్తయ్యేదన్న చంద్రబాబు
- సాగునీటికి రూ.24 వేల కోట్లు
- కాటన్ బ్యారేజీ పనుల ప్రారంభం

2 లో

# తమిళనాడు ప్రభుత్వానికి ఊరట



న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్): తమిళనాడులో గోవధపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన కీలక ఆదేశాలకు సుప్రీంకోర్టు సోమవారం తాత్కాలికంగా స్టే విధించింది. బక్రీద్ పండుగకు ముందు గానీ, ఆ తర్వాత ఏ రోజైనా గానీ రాష్ట్రంలో ఆవులు, దూడలను వధ చేయకుండా చూడాలని మద్రాస్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

రెండు వారాల క్రితం తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమిళనాడు జంతు సంరక్షణ చట్టం - 1958లోని సెక్షన్-4 ప్రకారం అనుమతించిన ప్రత్యేక పరిస్థితుల్ని మినహాయించి.. ఆవుల వధపై సంపూర్ణ నిషేధం విధించడం చట్టానికి విరుద్ధమని ప్రభుత్వం తన పిటిషన్లో పేర్కొంది. ప్రస్తుత చట్టం ప్రకారం 10 సంవత్సరాలు దాటినా లేదా.. వ్యవసాయ పనులకు, సంతానోత్పత్తికి పనికిరాని పశువుల్ని సంబంధిత అధికారుల ధృవీకరణ పత్రంతో వధించేందుకు అనుమతి ఉందని ప్రభుత్వం వాదించింది. ఈ వాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు.. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో సవరణ చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానిస్తూ.. ఆ ఉత్తర్వుల్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు హైకోర్టు ఆదేశాలు అమల్లో ఉండవని స్పష్టం చేసింది.


ఈ వివాదానికి కారణమైన ఉత్తర్వులను మే 27న జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ వి లక్ష్మీనారాయణన్‌లతో కూడిన మద్రాస్ హైకోర్టు ధర్మాసనం జారీ చేసింది. అధీకృత స్లాటర్ హౌస్‌లలో మాత్రమే జంతువుల వధ జరగాలని పేర్కొన్న హైకోర్టు, బక్రీద్ సందర్భంగా మాత్రమే కాకుండా ఇతర ఏ రోజునైనా ఆవులు, దూడలను వధ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వాలని కూడా పేర్కొంది.

# అయోధ్య విరాళాల కేసులో కీలక మలుపు



న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుప్రీంకోర్టు ఈ వ్యవహారంపై విచారణ జరిపి.. కేంద్రం, యూపీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. నిధుల దుర్వినియోగంపై న్యాయస్థానం పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరపాలని దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం కీలక విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపి, రామాలయ నిర్వహణను చూసుకునే 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్'కు కూడా తమ సమాధానాన్ని దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ నిధుల దుర్వినియోగంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించిన ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును కోర్టుకు సమర్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ సిట్ బృందంలో ఎవరెవరు సభ్యులుగా ఉన్నారనే వివరాలను కూడా ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొనాలని ఆదేశిస్తూ.. కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి (జూలై 20, 2026) వాయిదా వేసింది.

# పోలవరం పూర్తిపై సీఎం కీలక వ్యాఖ్యలు



న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్): పోలవరం ప్రాజెక్టు పూర్తిపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. కోనసీమ జిల్లాలో పర్యటించిన ఆయన ధవళేశ్వరం బ్యారేజీ కొత్త గేట్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు రాబోతున్నాయని, అప్పటికి ముందే పోలవరం పూర్తి చేసి ప్రజలకు అంకితమిస్తామని చెప్పారు. రూ.153 కోట్లతో కాటన్ బ్యారేజీ గేట్ల మరమ్మత్తు పనులు చేశామని తెలిపారు. కాటన్ బ్యారేజీ నిర్మించి 175 ఏళ్లు అయిందని గుర్తు చేశారు. దేశానికి అన్నపూర్ణగా గోదావరి డెల్టా మారడానికి కాటనే కారణమన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండి ఉంటే 2021లోనే పోలవరం పూర్తయ్యేదని చెప్పారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు ఇచ్చామన్నారు. కృష్ణా నీటిని రాయలసీమకు అందించామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

నా హయాంలోనే రెండు పుష్కరాలు

"రైతులకు అన్నదాత సుఖీభవ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసిన సీఎం చంద్రబాబు.. రూ.24 వేల కోట్లు సాగునీటి కోసం ఖర్చు చేశామని తెలిపారు. "తుంగభద్ర గేట్లు కొట్టుకుపోతే మళ్లీ ఏర్పాటు చేశాం. రెండు పుష్కరాలు నా హయాంలోనే జరుగుతున్నాయి. సైబరాబాద్‌ను నేనే అభివృద్ధి చేశా." అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# తెలంగాణకు సుప్రీంలో ఎదురుదెబ్బ

మొదటి పేజీ తరువాయి

ఈ కేసులో మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని, ఏపీ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తక్షణమే స్టే (ఇంజెక్షన్ ఉత్తర్వులు) ఇవ్వడంతో పాటు నోటీసులు జారీ చేయాలని అభ్యర్థించారు.

అయితే, తెలంగాణ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం వేలెత్తి చూపింది. పిటిషన్‌లోని ఆ లోపాలను పూర్తిగా సరిదిద్దే వరకు ఎలాంటి క్షేత్రస్థాయి విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. తొలుత ఆ లోపాలను సరిదిద్దిన తర్వాతే విచారణలో మిగతా అంశాలను పరిశీలిస్తామని కోర్టు తేల్చి చెప్పింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించకుండా, ప్రాథమిక లోపాలు ఉన్న స్థితిలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం కానీ, ఇంజెక్షన్ ఉత్తర్వులు ఇవ్వడం కానీ అస్సలు కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ప్రభుత్వంపై అసంతృప్తి.. 'బోడిగుండు'తో నిరసన



న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్): కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో ఉద్యోగ సంఘాల ఫెడరేషన్ వినూత్న నిరసనకు దిగింది. 'చంద్రన్న బోడిగుండు' పేరుతో ఫెడరేషన్ చైర్మన్ వెంకట్రామిరెడ్డితో పాటు పలువురు నేతలు గుండు చేయించుకుని ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఉద్యోగులకు రావాల్సి ఆర్థిక ప్రయోజనాలను కూడా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని మండిపడ్డారు. పీఆర్సీతో పాటు ఐఆర్, డీఏలు, సరెండర్ లీవ్‌ల చెల్లింపులనూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రయోజనాలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఐఆర్ విషయంలోనూ అన్యాయమే జరిగిందన్నారు. ఉద్యోగులతో పాటు వాలంటీర్లకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ నెరవేర్చే వరకూ తమ పోరాటం కొనసాగుతోందని హెచ్చరించారు.

# నామినేటెడ్ పదవులపై తుది కసరత్తు

మొదటి పేజీ తరువాయి

ఈ నెల 14న పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి హైదరాబాద్‌కు రానున్నారు. 15 లేదా 16 తేదీల్లో నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమై నామినేటెడ్ పదవుల నియామకం పై తుది నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఒక్కో పదవికి 10 మంది పోటీ..

ఈ నెల 8న 37 మంది నామినేటెడ్ చైర్మన్ల రెండేళ్ల పదవీకాలం ముగిసింది. ఈ పదవులను దక్కించుకునేందుకు తాజా మాజీ చైర్మన్లు, అసలే పదవులు దక్కని లీడర్లు సైతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పదవి ఉంటే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ సౌకర్యం లభిస్తుంటుంది. మంత్రులు, అధికారుల వద్దకు ఈజీగా వెళ్లే అవకాశం ఉంటుంది. వీటికి తోడు ప్రభుత్వం కల్పించే వెహికల్, గన్‌మెన్ సౌకర్యంతో రాజకీయంగా పరపతి పెరుగుతుంది. రాజకీయాల్లో మరింత ఎత్తుకు ఎదిగేందుకు వెసులుబాటు కలుగుతుంది. అందుకని చైర్మన్ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలనే తపనలో లీడర్లు ఉన్నారు. దీంతో ఒక్కో పదవికి సుమారు 10 మంది వరకు పోటీ పడుతున్నట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

పెద్ద ఎత్తున లాబీయింగ్

చైర్మన్ పదవులను దక్కించుకోవాలని టార్గెట్‌గా పెట్టుకున్న లీడర్లు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు. ముందుగా జిల్లాకు చెందిన మంత్రుల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. ఆ తరువాత జిల్లా ఇన్‌చార్జిల మనస్సు గెలుచుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఈ రెండు చోట్ల లైన్‌క్లియర్ అయిన వెంటనే ప్రభుత్వంలోని కీలక నేతల ఆశీస్సుల కోసం లాబీయింగ్ చేస్తున్నారు. కొందరు నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరైతే ఏకంగా ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది. పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీలోని కీలక నేతలు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వద్దకు వెళ్లి పదవి ఇప్పించాలని ప్రాధేయపడుతున్నట్టు తెలిసింది.

మరో ఛాన్స్ కోసం..

తాజా మాజీ చైర్మన్లు అందరూ మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇందులో కొందరికి మాత్రమే రెన్యువల్ చేసే అవకాశం ఉంది. చైర్మన్ హోదాలో సదరు నాయకుడు పనితీరు ఆధారంగా మరోసారి అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్టు తెలిసింది. అదే సంస్థకు చైర్మన్ పదవి ఇవ్వాలా? లేక మరో సంస్థ బాధ్యతలు అప్పగించాలా? అనే అంశంపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. కొందరు పాత సంస్థలో మరోసారి పని చేసేందుకు మొగ్గుచూపుతుండగా, మరికొందరు కొత్త సంస్థలో పనిచేసేందుకు చొరవ చూపుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

# కాంగ్రెస్‌పై పోరుకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాల పనులను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. "ప్రాజెక్టులను ఆపి ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఆ బసవేశ్వరుడు, సంగమేశ్వరుడే తగిన గుణపాఠం చెబుతారు" అని హరీశ్ రావు హెచ్చరించారు.

ప్రజా క్షేత్రంలోనే కాంగ్రెస్ తప్పుల లెక్కింపు..

అధికారంలోకి వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, పైగా నడుస్తున్న ప్రాజెక్టులను కూడా పడకేసేలా చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ చేస్తున్న ఈ చారిత్రక తప్పులను, వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకే తాను జనం మధ్యకు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పాదయాత్ర ద్వారా నిలిచిపోయిన ప్రాజెక్టుల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఏకైక లక్ష్యంగా హరీశ్ రావు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. హరీశ్ రావు పాదయాత్ర ప్రకటనతో ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది.

# తెలంగాణలో 7 ఈఎస్ఐసీ ప్రాజెక్టులు

మొదటి పేజీ తరువాయి

ఇక్కడి రూ.211.13 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన నూతన ఓపీడీ విభాగాన్ని కేంద్ర మంత్రి స్వయంగా ప్రారంభించనుండగా, దేశంలోని మిగిలిన 6 ప్రాజెక్టులను ఇక్కడి నుంచే వర్చువల్ విధానంలో దేశానికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్మిక-ఉపాధి, సూక్ష్మ-చిన్న-మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే కూడా పాల్గొంటారు. దేశ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్న నిర్మాణ కార్మికులను ఈ వేదికపై మాండవీయ సత్కరించనున్నారు. అలాగే ఈఎస్ఐ లబ్ధిదారులకు నగదు ప్రయోజనాలను అందజేస్తారు.

తెలంగాణ కార్మికులకు వరం.. సనత్‌నగర్ కొత్త ఓపీడీ

హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల, ఆసుపత్రి ఆవరణలో 43,611.04 చదరపు మీటర్ల భారీ విస్తీర్ణంలో ఈ నూతన ఓపీడీ విభాగాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించారు. ఇందులో జనరల్ మెడిసిన్, ఈఎన్టీ, డెంటల్, గైనకాలజీ, కంటి చికిత్స, ఆర్థోపెడిక్స్, సైకియాట్రీ, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, ఆయుష్ విభాగాల ఓపీడీ సేవలు ఒకే చోట లభిస్తాయి. దీనితో పాటు ఫిజియోథెరపీ, రేడియాలజీ, యోగా కేంద్రం, 180 సాధారణ పడకలు (మూడు 60 పడకల వార్డులు), 25 ఐసీయూ పడకలు, 20 ఎన్ఐసీయూ పడకలు, మందుల దుకాణం, క్లినికల్ లెక్చర్ థియేటర్లను ఏర్పాటు చేశారు.

ఈ కొత్త విభాగం ద్వారా తెలంగాణలోని హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని 12,30,183 మంది బీమా చందాదారులు, వారి కుటుంబ సభ్యులకు సమగ్ర వైద్య సేవలు అందనున్నాయి. కాగా... 1975 మార్చి 30న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం జంట నగరాల (హైదరాబాద్, సికింద్రాబాద్) పరిధికే పరిమితమై ప్రారంభమైన ఈ ఈఎస్ఐ ఆస్పత్రి, కాలక్రమేణా సేవలని విస్తరించింది. ప్రస్తుతం ఈఎస్ఐసీ 2.0 సంస్కరణల కింద తెలంగాణలోని మొత్తం 33 జిల్లాలకూ ఈ పథకాన్ని వర్తింపజేశారు. దీని ద్వారా రాష్ట్రంలో సామాజిక భద్రత కింద మొత్తం 19,15,700 మంది బీమా చందాదారులు, 74,32,916 మంది లబ్ధిదారులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి.

దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఇతర ప్రాజెక్టుల వివరాలు

రాజమహేంద్రవరం ఈఎస్ఐఎస్ ఆసుపత్రి (ఆంధ్రప్రదేశ్): ఇక్కడ 26 ఓపీడీ గదులు, 3 ఆధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో కూడిన వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. దీనివల్ల 1,31,190 మంది బీమా చందాదారులతో పాటు మొత్తం 2,52,717 మంది లబ్ధిదారులకు మేలు జరుగుతుంది.

బెల్తోలా ఈఎస్ఐసీ ఆసుపత్రి (అస్సాం): ఇక్కడి ఆసుపత్రిని 200 పడకల సామర్థ్యానికి ఉన్నతీకరించారు. దీని ద్వారా అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లలోని 3.42 లక్షల మంది బీమా చందాదారులతో సహా మొత్తం 13.27 లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది.

శ్రీపెరంబుదూర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి (తమిళనాడు): ప్రముఖ మ్యానుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మారిన శ్రీపెరంబుదూర్‌లో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించనున్నారు. ఇక్కడ ఓపీడీ, ఎమర్జెన్సీ, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ల్యాబ్, ఫార్మసీ సదుపాయాలు ఉంటాయి. దీనివల్ల కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల పరిధిలోని 5.5 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుంది.

సురేంద్రనగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీ (గుజరాత్): ఇక్కడ ఒకే చోట ప్రాథమిక ఆరోగ్య సేవలు, వైద్య సంప్రదింపులు, మందులు లభిస్తాయి. దీని ద్వారా సుమారు 35,000 మందికి లబ్ధి చేకూరుతుంది.

కోటా ఉద్యోగ నగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీ (రాజస్థాన్): ఇక్కడి పారిశ్రామిక ప్రాంత కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా 75,000 మంది బీమా చందాదారులు సహా మొత్తం 2,91,000 మందికి సేవలు అందుతాయి.

భవానీ మండి ఈఎస్ఐ డిస్పెన్సరీ (రాజస్థాన్): ప్రముఖ టెక్స్‌టైల్ హబ్ అయిన ఈ ప్రాంతంలోని పారిశ్రామిక కార్మికుల కోసం ఏర్పాటైన ఈ డిస్పెన్సరీ ద్వారా 27,715 మంది చందాదారులు సహా మొత్తం 1.07 లక్షల మందికి ఆరోగ్య సేవలు అందనున్నాయి.

# ఆరు హత్యల కేసులో కీలక పరిణామం




న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్): రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని దైవాలగూడ గ్రామంలో ఒకే రాత్రి ఆరుగురిని కిరాతకంగా నరికి చంపి, రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కథ విషాదాంతమైంది. గత రెండు రోజులుగా పోలీసుల కళ్లుగప్పి పరారీలో ఉన్న రాజ్‌కుమార్ చివరకు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండల పరిధిలోని పంజర్ల గ్రామ శివారులో అతడి మృతదేహం లభ్యమవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

ఘటనా స్థలంలో పాయిజన్ బాటిల్..

పోలీసుల కథనం ప్రకారం.. పంజర్ల గ్రామ శివారు ప్రాంతంలో ఒక వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని షాబాద్ నరమేధం కేసులో మోస్ట్ వాంటెడ్ నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్‌గా గుర్తించారు. మృతదేహం పక్కనే పాయిజన్ బాటిల్ లభ్యం కావడంతో, పోలీసుల వేట తీవ్రమవ్వడం, ఎటూ తప్పుకుపోయే అవకాశం లేకపోవడంతో అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

మేనమామ ఊరిలో బలవన్మరణం

అయితే, హత్యలు జరిగిన తర్వాత నిందితుడిని పట్టుకునేందుకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు సుమారు 12 ప్రత్యేక బృందాలతో విస్తృతంగా గాలింపు చేపట్టారు. అంతేకాకుండా అతడి ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించారు. పోలీసుల గాలింపు తీవ్రమవడంతో ఎక్కడా ఆశ్రయం దొరకక, చివరకు కొత్తూరు మండలంలోని తన మేనమామ ఊరైన పంజర్లకు రాజ్‌కుమార్ చేరుకున్నాడు. అక్కడే గ్రామ శివారులోకి వెళ్లి విషం తాగి ప్రాణాలు తీసుకున్నాడు. తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో కన్నబిడ్డలు, భార్యతో సహా ఆరుగురిని పొట్టనబెట్టుకున్న కిరాతకుడు.. చివరకు ఇలా పాయిజన్ తాగి శవమై తేలడంతో కేసు దాదాపు ముగిసినట్లయింది. ఈ మేరకు పోలీసులు రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# టీజీ టెట్ ఫలితాల విడుదల

న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్): తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్-జూన్ 2026) ఫలితాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ విడుదల చేశారు. జూన్ 16 నుంచి 22 వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో 10 సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,53,752 మంది దరఖాస్తు చేసుకోగా, 1,15,028 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 50,544 మంది అర్హత సాధించగా, మొత్తం ఉత్తీర్ణత శాతం 43.94గా నమోదైంది.

పేపర్-1లో ఉత్తీర్ణత శాతం 65.29గా ఉండగా, పేపర్-2 (మ్యాథ్స్ అండ్ సైన్స్)లో 40.76 శాతం, పేపర్-2 (సోషల్ స్టడీస్)లో 25.79 శాతం అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టీజీటెట్ నోటిఫికేషన్‌ను జూలై 21న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఆ పరీక్షలు సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు సీబీటీ విధానంలో నిర్వహించబడతాయి. ఇకపై ప్రతి సంవత్సరం మొత్తం నాలుగు టెట్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో రెండు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు, మరో రెండు సాధారణ అభ్యర్థులకు కేటాయించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఇరాన్ హిట్‌లిస్టు!



న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్): పశ్చిమాసియా లో యుద్ధం ఆగినట్టే కనిపించినా ఇటీవల మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్, అమెరికా పరస్పర దాడులతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న నౌకలపై ఐఆర్‌జీసీ దాడులు చేయడం తాజా ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని స్థానిక మీడియా.. 13 మంది విదేశీ నేతల పేర్లతో ఉన్న రివేంజ్ లిస్ట్‌ను ప్రచురించింది. ఈ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సహా పలువురు ఐరోపా నేతల పేర్లు ఉన్నాయి.

ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో నాటి సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ఇటీవల మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని, దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రతీకార జాబితా బయటకు రావడం చర్చనీయాంశమైంది.

ఇరాన్ వ్యాప్తంగా పదుల సంఖ్యలో లక్ష్యాలపై తాము దాడి చేశామని, వాటిలో క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, మందుగుండు సామగ్రి డంప్‌లు, కమ్యూనికేషన్ సాధనాలు, చిన్న బోట్ల వంటివి ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అనంతరం గల్ఫ్‌లోని పలు దేశాల్లో సైరన్లు వినిపించాయి. బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఒమన్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తాజాగా ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా డ్రోన్ ఫ్లీట్, రెండు క్షిపణి లాంచర్లు, క్షిపణులను నిల్వ చేసిన గిడ్డంగులను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది.

అగ్రరాజ్యం చేస్తున్న దాడులతో పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ఇంతకాలంగా జరిగిన దౌత్యచర్చలు నిరుపయోగంగా మారాయని టెహ్రాన్ దుయ్యబట్టింది. అమెరికా వల్లే హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకాయానానికి అంతరాయం ఏర్పడిందని ఆరోపించింది.

# మమతకు కోర్టు షాక్



న్యూస్ డెస్క్, 13 జూలై (బిఎన్ఎస్): పశ్చిమ బెంగాల్‌లో మాజీ సీఎం మమతా బెనర్జీకి షాక్ తగులగా, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) చీలికవర్గానికి న్యాయస్థానంలో గొప్ప ఊరట లభించింది. రెబల్ నేత రితబ్రత వర్గాన్నే తృణమూల్ కాంగ్రెస్ ఏకైక చట్టబద్ధమైన విభాగంగా గుర్తిస్తూ అలీపూర్ కోర్టు తీర్పు చెప్పింది. జూన్ 22న జాతీయ కార్యవర్గ సమావేశంలో ఏర్పాటు చేసిన కమిటీయే పార్టీకి సంబంధించిన ఏకైక చట్టబద్ధమైన విభాగమని తీర్పు చెబుతూ.. ఆ వర్గానికే పార్టీ కార్యాలయాలు, నిధులపై నియంత్రణ కల్పిస్తున్నట్టు పేర్కొంది.

తమదే అసలైన పార్టీ విభాగంగా గుర్తిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు పట్ల రితబ్రత ఆనందాన్ని వ్యక్తం చేశారు. న్యాయస్థానం ఉత్తర్వు కాపీ వచ్చిన వెంటనే దానిని ఎన్నికల సంఘానికి పంపుతానని తెలిపారు. ఈ తీర్పు తర్వాత గుర్తింపు పొందిన కమిటీకి తప్ప మరెవరికీ తృణమూల్ కాంగ్రెస్ పేరుతో సంస్థను నడిపే హక్కు లేదని ఆయన ఉద్ఘాటించారు. ఈ తీర్పుతో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు, నిధులపై తమకు పూర్తి నియంత్రణ వస్తుందన్నారు.

# మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్రీ లెఫ్ట్ టర్న్ అండర్‌పాస్‌ను పరిశీలించిన సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్, సన్‌ప్రీత్ సింగ్



సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కొనసాగుతున్న మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్రీ లెఫ్ట్ టర్న్ అండర్‌పాస్‌ను సందర్శించారు. అధికారులు స్థలాన్ని పరిశీలించి, పనులు పూర్తయిన తర్వాత ట్రాఫిక్ సాఫీగా నడిచేలా ఉండేందుకు విలువైన సూచనలు అందించారు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, వాటి కారణంగా ట్రాఫిక్‌పై పడుతున్న ప్రభావాన్ని సమీక్షించి, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ట్రాఫిక్‌ను సురక్షితంగా, అంతరాయం లేకుండా మళ్లించేందుకు అవసరమైన ప్రాంతాల్లో బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే డైవర్షన్ అమలుకు ముందు ట్రయల్ రన్ నిర్వహించి, లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు.

నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ప్రజలకు ఇబ్బందులు తగ్గేలా ట్రాఫిక్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ పోలీసులు, నిర్మాణ సంస్థలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.

ఈ పరిశీలనలో డీసీపీ ట్రాఫిక్–I ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్–I టి. హనుమత్ రావు, ట్రాఫిక్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

# తప్పు చేసిన ఖాకీ పై కన్నెర్ర జేసిన జిల్లా ఎస్పీ

హత్య కేసు తప్పుదోవ పట్టించిన బుచ్చిరెడ్డిపాలెం
సీఐ శ్రీనివాసరావు ను విఆర్ కు పంపడం తో పాటు స్టేషన్ లోని
23 సిబ్బందిని మొత్తం బదిలీచేసిన జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల




నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం(బి.యన్.యస్):– నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్లో సీఐ మాతంగి శ్రీనివాసరావును విఆర్ కు పంపడంతో పాటు.. స్టేషన్లో ఉన్న మొత్తం 23 మందిని ఎస్పీ అజిత వేజెండ్ల బదిలీ చేశారు. బుచ్చిరెడ్డిపాలెం మండలం వ్యవసాయ అధికారి శ్రీహరి జూన్ 15న మృతి చెందారు. ముందుగా గుండెపోటుగా చిత్రీకరించారు. తర్వాత సొంత బావమరిది ఆస్తి కోసం కుక్కలను చంపే ఇంజక్షన్లు ఎక్కించినట్లు వెలుగులోకి వచ్చింది. మొదట హత్య అని చెప్పినా ఆ కోణంలో దర్యాప్తు చేయకపోవడం, కేసును పక్కదోవ పట్టించారనే ఆరోపణలతో పీఎస్ సిబ్బందిపై వేటు పడింది.

# వరుస బైక్ దొంగతనాల ముఠా అరెస్ట్

కుత్బుల్లాపూర్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వరుస ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సైబరాబాద్ పరిధిలోని పేట్–బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ముఠా సభ్యులు ఒక కారులో తిరుగుతూ రద్దీగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకునేవారు. అక్కడ పార్క్ చేసి ఉన్న బైక్‌లను మాస్టర్ కీలు, కట్టర్ల సహాయంతో క్షణాల్లో దొంగిలించి పరారయ్యేవారు. మైసమ్మగూడలోని అపారెల్ పార్క్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ముఠా అనుమానాస్పదంగా కనిపించి దొరికిపోయింది.

పోలీసులు ఈ కేసులో ముగ్గురు ప్రధాన నిందితులైన బౌరి అశోక్ సింగ్ (19), అయల్పురం రఘుపతి (22), బండి ప్రణీత్ (23)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిలో ఒక్కొక్కరిపై గతంలోనే వివిధ పోలీస్ స్టేషన్లలో మూడు నుండి నాలుగు దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. కాగా, ఈ ముఠాలో ఉన్న చైతన్య, సురేష్ అనే మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని డీసీపీ తెలిపారు. పట్టుబడిన నిందితులను విచారించగా తాము ఇప్పటివరకు రెండు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 19 చోరీ కేసుల్లో భాగస్వామ్యులైనట్లు నేరాన్ని అంగీకరించారు.

నిందితుల నుంచి పోలీసులు రూ. లక్షల విలువైన 21 ద్విచక్ర వాహనాలతో పాటు, దొంగతనాలకు ఉపయోగించిన సుజుకి ఎర్టిగా కారు, 3 మొబైల్ ఫోన్లు, 2 స్క్రూ డ్రైవర్లు, 5 ఎలక్ట్రికల్ స్విచ్‌లు, 2 కట్టర్లు మరియు 2 మాస్టర్ కీలను స్వాధీనం చేసుకున్నారు. పేట్–బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా జరుగుతున్న వాహనాల చోరీలపై అదనపు డీసీపీ పురుషోత్తం మార్గదర్శకత్వంలో, మేడ్చల్ ఏసీపీ సిహెచ్. శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.




ఈ ముఠాను పట్టుకోవడంలో ప్రత్యేక బృందాలు కీలకమైన సీసీటీవీ ఫుటేజీలను, స్థానిక నిఘా వర్గాల సమాచారాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకున్నాయి. టెక్నాలజీ సాయంతో దొంగల కదలికలను నిరంతరం ట్రాక్ చేస్తూ పక్కా ప్లాన్‌తో వారిని అదుపులోకి తీసుకున్నారు. తక్కువ సమయంలోనే ఈ భారీ ద్విచక్ర వాహనాల చోరీ ముఠాను ఛేదించి, విలువైన సొత్తును రికవరీ చేసిన పేట్–బషీరాబాద్ పోలీసుల చాకచక్యాన్ని, ప్రతిభను ఉన్నతాధికారులు అభినందించారు. కేసును ఛేదించిన సిబ్బందికి త్వరలోనే ప్రత్యేక పురస్కారాలు అందిస్తామని డీసీపీ ఎన్. కోటి రెడ్డి ప్రకటించారు.

# త్వరలో 2వ దశ డైరెక్ట్ జాబ్ కేలండర్. సిఎస్ సాయిప్రసాద్.



అమరావతి, జూలై 13 (బిఎన్ఎస్): రాష్ట్రంలో రెండవ దశ జాబ్ కేలండర్ సన్నద్ధం చేస్తున్నట్లు ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా కార్యదర్శులు, శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు. భర్తీ చేయాల్సిన పోస్టుల నోటిఫికేషన్, కంప్లీషన్ ఆఫ్ ఇ–హెచ్ఆర్ఎం,లోకల్ కేడర్ ఆర్గనైజేషన్ కు అనుగుణంగా నోటిఫికేషన్,నూతన లోకల్ కేడర్లలో పోస్టుల కేటాయింపు నోటిఫికేషన్,అన్ని కేడర్లలో ప్రాధాన్యత కేటగిరీలకు సంబంధించి సీనియారిటీ జాబితా ప్రిపరేషన్,ఎలాంట్మెంట్ ఆఫ్ పెర్సన్స్,ఓపెనింగ్ ఆఫ్ రోస్టర్స్, ఎపిపిఎస్సి ఇతర రిక్రూటింగ్ ఏజెన్సీలకు ఇండెంట్స్ పంపడం తదితర అంశాలపై సమీక్షించారు. ఈప్రక్రియను నిర్దిష్ట వ్యవధి ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని కార్యదర్శులు,హెచ్ఓడిలను ఆదేశించారు.అంతేగాక బదిలీలు,పదోన్నతులకు సంబంధించిన అన్ని అంశాల్లో ఉద్యోగులతో పూర్తి స్నేహపూర్వకంగా,మర్యాదపూర్వకంగా వ్యవహరించి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.పెండింగ్లో ఉన్న వివిధ క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన కేసులు 6నెలల వ్యవధిలోపు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ వద్ద నుంచి పూర్తి వివరాలను సేకరించారు. నిర్దేశిత టైమ్ లైన్ ప్రకారం ఉద్యోగుల కేటాయింపు తదితర చర్యలు పూర్తి చేయాలని ఇందుకు సంబంధించిన జిఓలను వెంటనే జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈసమావేశంలో స్పెషల్ సిఎస్ లు బి.రాజ శేఖర్,కృష్ణ బాబు,జి.జయలక్ష్మి,ముఖ్య కార్యదర్శులు,కార్యదర్శులు,వివిధ శాఖాధిపతులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నిబంధనలకు తూట్లు -- గ్రీవెన్స్ లో డీఆర్ఓ కు ఫిర్యాదు

ఎన్యూమరేషన్‌లో అవకతవకలు, ఫేక్ ఓట్ల నమోదు జరిగిందని ఆరోపణ



అమలాపురం (బీఎన్ఎస్) జూలై 13: అమలాపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎస్ఐఆర్ (Special Intensive Revision) ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి డిఆర్ఓ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమ నిబంధనలను పూర్తిగా విస్మరించి అధికార పార్టీ ఒత్తిడితో బీఎల్ఓల ద్వారా సేకరించిన ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మాత్రమే వినియోగించాల్సిన సమాచారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ డేటా చౌర్యానికి పాల్పడుతున్నారని, అధికార పార్టీ ప్రజల రాజకీయ అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఇంటిని పలుమార్లు సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాల్సిన బాధ్యతను అధికారులు సక్రమంగా నిర్వర్తించకుండా, చివరి నాలుగు రోజుల్లో హడావుడిగా సంతకాలతో కూడిన ఫారాలను సేకరించి, ఫేక్ ఓట్ల నమోదుకు అవకాశం కల్పించారని ఆరోపించారు. అయినప్పటికీ కొన్ని మండలాల్లో 90 నుండి 99 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని అధికారులు ప్రకటించడం ప్రజలను మాత్రమే కాకుండా ఎన్నికల కమిషన్‌ను కూడా తప్పుదోవ పట్టించే చర్యగా అభివర్ణించారు. గత నాలుగు రోజుల్లో సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలపై స్వతంత్ర విచారణ నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్‌తో పాటు ఎన్నికల కమిషన్‌కు కూడా వినతులు సమర్పిస్తామని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి డిఆర్ఓ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమ నిబంధనలను పూర్తిగా విస్మరించి అధికార పార్టీ ఒత్తిడితో బీఎల్ఓల ద్వారా సేకరించిన ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మాత్రమే వినియోగించాల్సిన సమాచారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ డేటా చౌర్యానికి పాల్పడుతున్నారని, అధికార పార్టీ ప్రజల రాజకీయ అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఇంటిని పలుమార్లు సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాల్సిన బాధ్యతను అధికారులు సక్రమంగా నిర్వర్తించకుండా, చివరి నాలుగు రోజుల్లో హడావుడిగా సంతకాలతో కూడిన ఫారాలను సేకరించి, ఫేక్ ఓట్ల నమోదుకు అవకాశం కల్పించారని ఆరోపించారు. అయినప్పటికీ కొన్ని మండలాల్లో 90 నుండి 99 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని అధికారులు ప్రకటించడం ప్రజలను మాత్రమే కాకుండా ఎన్నికల కమిషన్‌ను కూడా తప్పుదోవ పట్టించే చర్యగా అభివర్ణించారు. గత నాలుగు రోజుల్లో సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలపై స్వతంత్ర విచారణ నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్‌తో పాటు ఎన్నికల కమిషన్‌కు కూడా వినతులు సమర్పిస్తామని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు.

# భక్త జనంతో పోటెత్తిన శివాలయాలు



కాకినాడ (బిఎన్ఎస్ )జూలై: 13 ఆరుద్ర నక్షత్రం సోమవారం మాస శివరాత్రి పర్వదినం కావడంతో నగరంలోని శివాలయాలు అన్ని భక్తజనంతో పోటెత్తాయి, ఇటువంటి పర్వదినం రోజున ఆ మహా శివునికి అభిషేకం చేస్తే మంచిదని బ్రాహ్మలు చెప్పడంతో శివాలయాలకు పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ గాంధీనగర్ లో వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో ఈవో బాదం శ్రీనివాస చంద్రమూర్తి మాట్లాడుతూ ఈరోజు మాస శివరాత్రి ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో జనం తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున తరలివచ్చారని వచ్చిన భక్తులకు ఏ విధమైన ఆ సౌకర్యం కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

# రైతుల 10 రోజుల నిరసనలకు ఫలితం..

## రిత్విక్ కంపెనీతో చర్చలు సఫలం

### పంట నష్టాలు, బోర్లు బూడిపోవడంపై రైతుల ఆగ్రహం రోడ్డు నిర్మాణం, వాటర్ ప్లాంట్లకు కంపెనీ ప్రతినిధుల హామీ

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 13:

కడపజిల్లా.. బ్రహ్మంగారి మఠం మండలం రేకలకుంట పంచాయతీ పరిధిలోని రైతులు గత 10 రోజులుగా చేపట్టిన శాంతియుత నిరసనలు ఎట్టకేలకు ఫలించాయి. తమ సమస్యలపై స్పందించాలంటూ స్థానిక రిత్విక్ కంపెనీ ఎదుట రైతులు ఆందోళనలు చేపట్టగా, సోమవారం కంపెనీ యాజమాన్యం రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ చర్చల్లో రైతుల డిమాండ్లకు కంపెనీ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించడంతో వివాదం సద్దుమణిగింది. రేకులకుంట, బాలాజీ నగర్, బాగాదిపల్లె, గొల్లపల్లె, జెడ్. కొత్తపల్లె, డి. అగ్రహారం, టి రామాపురం, వాంపల్లి చెరువు, గ్రామాలకు చెందిన రైతులు గత పది రోజులుగా రిత్విక్ కంపెనీ వద్ద పలుమార్లు నిరసనలు తెలియజేశారు. గత మూడేళ్లుగా ఈ కంపెనీ వల్ల స్థానిక ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ పనుల వల్ల విపరీతంగా దుమ్ము, ధూళి లేచి పంటలపై విస్తరించడంతో చేతికి రావాల్సిన పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ పరిధిలో జరుగుతున్న భారీ




బ్లాస్టింగ్‌ల కారణంగా భూగర్భంలో మార్పులు వచ్చి, బోర్లలోని మోటర్లు, పైపులు, ఇరుక్కుపోతున్నాయని, వాటిని బయటకు తీయడం సాధ్యం కాక ఎంతో మంది రైతులు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని, వివరించారు. స్థానిక నీటి వనరులను కంపెనీ వాడుకుంటూ, తమకు మాత్రం నష్టాన్ని మిగులుస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో రైతులు ఒక కీలకమైన ప్రతిపాదనను యాజమాన్యం ముందుంచారు. ప్రస్తుతం రేకలకుంట పంచాయతీ ప్రజలు మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠం వెళ్లాలంటే దాదాపు 40 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోంది. అయితే, తెలుగుగంగ, బ్రహ్మసాగర్ నుంచి కడపకు నీటిని తరలించేందుకు వేసిన పైప్‌లైన్ పనుల పరిశీలన కోసం ఇప్పటికే రేకలకుంట గంగమ్మ ఆలయం, నూతన సచివాలయం వద్ద నుంచి ఒక రహదారిని ఏర్పాటు చేశారు. ఇప్పుడు రిత్విక్ కంపెనీ నిర్మించిన రోడ్డు నుంచి కేవలం 3 కిలోమీటర్ల లింక్ రోడ్డును ఏర్పాటు చేస్తే, మండల కేంద్రానికి వెళ్లే దూరం దాదాపు 20 నుంచి 25 కిలోమీటర్ల మేర తగ్గుతుందని, ఇది ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని కంపెనీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, స్థానిక అభివృద్ధికి కంపెనీ సహకరించాలని డిమాండ్ చేశారు. కడపజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ చర్చలలో రిత్విక్ కంపెనీ తరపున లైజరింగ్ మేనేజర్ జయప్రకాష్, జనరల్ మేనేజర్ తిరుమురుగన్, హెచ్ ఆర్ కిరణ్, మేనేజర్ విష్ణువర్ధన్ తదితర ఉన్నతాధికారుల బృందం పాల్గొంది. రైతులు అడిగిన అంశాలన్నీ న్యాయమైనవేనని కంపెనీ ప్రతినిధులు అంగీకరించారు. రైతులు కోరిన రోడ్డు నిర్మాణానికి సంబంధించి త్వరలోనే పూర్తిస్థాయి ఎస్టిమేషన్ వేయించి పనులను ప్రారంభిస్తామని, అలాగే వాటర్ ప్లాంట్ల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులను కూడా త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కంపెనీ తరపున పూర్తి సహకారం ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ తమ నిరసనలను విరమించారు. ఈ సమావేశంలో రేకలకుంట పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల రైతులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కడప.. హైదరాబాద్ విమాన సర్వీసులను పునరుద్ధరించండి.. ఎంపీ పుట్టా మహేష్




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 13:

కడపజిల్లా ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, కడప విమానాశ్రయం నుండి హైదరాబాద్‌కు, అలాగే హైదరాబాద్ నుండి కడపకు నడుస్తున్న విమాన సర్వీసులను ఆదివారం, మంగళవారం, శుక్రవారం రోజులలో నిలిపివేసిన విషయాన్ని మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడును కలిసి వివరించారు. కడప.. హైదరాబాద్ మార్గంలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో పాటు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు మరియు అత్యవసర ప్రయాణికులు ఈ విమాన సర్వీసులపై అధికంగా ఆధారపడుతున్నారని, మహేష్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నిలిపివేసిన విమాన సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు వెంటనే ఇండిగో సంస్థ ఉన్నతాధికారులతో మాట్లాడి, కడప.. హైదరాబాద్, కడప విమాన సర్వీసుల పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. కడప జిల్లా ప్రజల ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు పుట్టా మహేష్ కుమార్ కడపజిల్లా ప్రజలకు తెలిపారు.

# కుటుంబ సమగ్ర సర్వే గడువులోగా పూర్తిచేయాలి: అదనపు కలెక్టర్ .



నల్లగొండ (బిఎన్ఎస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తి చేయాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ అధికారులను ఆదేశించారు... సమయం దగ్గర పడుతున్నందువలన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ హరిసింగ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా. స్వయంగా ఇండ్లుకు వెళ్లి ఎన్యుమరేటర్లు వివరాలు సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు... సర్వేలో భాగంగా అడిగే ప్రశ్నలకు ప్రజలందరూ సహకరించి, సరైన సమాచారం అందించాలని, సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని ఎన్యుమరేటర్లను, సూపర్వైజర్లను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఏ ఒక్క ఇల్లు, షాపు కూడా మిస్ కాకుండా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా సర్వే చేయాలని, డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు..

# జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ తయారీకి గణకులకు శిక్షణ




నల్లగొండ (బిఎన్ఎస్) : జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో సెన్సస్ హ్యాండ్ బుక్ అత్యంత కీలకమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. 2027 జనాభా గణనలో భాగంగా జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ తయారీకి క్షేత్రస్థాయిలో పనిచేసే గణకులకు జిల్లా కేంద్రంలో శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 265 గ్రామాలు, 5 మున్సిపాలిటీల పరిధిలో సమగ్ర సమాచార సేకరణ కోసం మొత్తం 270 మంది గణకులను నియమించినట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం జూలై 13 నుండి 18వ తేదీ వరకు మొత్తం ఆరు రోజుల పాటు ప్రతిరోజూ 50 మంది చొప్పున శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.. గ్రామ డైరెక్టరీ తయారీలో భాగంగా గణకులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రధానంగా విద్యా సదుపాయాలు, వైద్య సౌకర్యాలు, నీరు – పారిశుధ్యం, కమ్యూనికేషన్, రవాణా సౌకర్యాలు, బ్యాంకులు – రుణాలు, విద్యుత్ సౌకర్యాలు, భూవినియోగం, ప్రధాన వ్యవసాయ, తయారీ ఉత్పత్తులు మరియు హస్తకళలు, గ్రామ పరిశీలన అంశాలపై నివేదికలు సిద్ధం చేసి నిర్ణీత గడువులోగా సమర్పించాలని గణకులను కోరారు.

# ప్రజా ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా స్పందించాలి..!

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 13: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అధికారులు అలసత్వం వీడి ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. భూ సంబంధిత సమస్యలను రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలనలో పీజీఆర్ఎస్ నిర్వహణలో జిల్లా పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, అర్జీల పరిష్కారంలో ఆలస్యం లేకుండా అన్ని శాఖలు మరింత అప్రమత్తంగా పనిచేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన చేసి, అర్జీదారులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులు తెలుసుకొని సరైన సమాధానాలు ఇవ్వాలని, పొంతనలేని నివేదికలు సమర్పించరాదని అధికారులను హెచ్చరించారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సమాచార లోపాలు లేకుండా చూడాలని సూచించారు. పిజిఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన అర్జీలపై ప్రజల సంతృప్తి పబ్లిక్ సాటిస్ఫాక్షన్ స్థాయిని కూడా ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అందువల్ల ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి డీపీవో వెంకటసుబ్బయ్య, ఎస్ఎస్ఈ ఏపిసి అనురాధ, డీఆర్డీఏ పీడీ జి. రాజ్యలక్ష్మి, డీఎస్ఓ రఘురాం, డిఎంహెచ్ఓ డా. రవిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కడప జిల్లాలో రెండు రోజులపాటు మంత్రి లోకేష్ పర్యటన




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 13:

రేపటి నుండి రెండు రోజుల పాటు విద్యా, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ జిల్లాలో పర్యటించనున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి వెల్లడించారు. ఈ నెల 15 న రాష్ట్ర విద్యా, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా దాల్మియా సిమెంట్ కర్మాగారం రెండవ ప్లాంట్ కు శంకుస్థాపన చేసుకోవడం ఆనందంగా ఉందని భూపేష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పారిశ్రామికభివృద్ధిలో ప్రగతి పథంలో వెళ్లేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని భూపేష్ రెడ్డి పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ఈ క్రమంలో అడ్డంకులను తొలగించి జె ఎస్ డబ్ల్యూ ఉక్కు కర్మాగార పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించుకోవడం కూటమి పాలన చిత్తశుద్ధికి నిదర్శనం అని భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. జె ఎస్ డబ్ల్యూ ఉక్కు కర్మాగారంతో పాటు నియోజకవర్గంలో సెయిల్ సోలార్ ప్రాజెక్టును ఇది వరకే నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభించామని, ప్రస్తుతం దాల్మియా సిమెంట్ కర్మాగారం రెండవ ప్లాంట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరుపుకోనుండటం జిల్లా, నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తోందని తెలిపారు. అంతేకాకుండా జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడ పనులను ప్రారంభించడంతో పాటు, పారిశ్రామిక కారిడార్ గా కొప్పర్తిని తీర్చిదిద్దుతున్నారని వెల్లడించారు. కొప్పర్తిలో షిర్డీ సాయి కంపెనీకి సుమారు 450 ఎకరాలను కేటాయించి పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

జిల్లాలో మంత్రి నారా లోకేష్ రెండు రోజుల పాటు పర్యటన సాగుతుందని వెల్లడించారు. 14 న సాయంత్రం కడప ఎయిర్పోర్ట్ కు చేరుకొని రాత్రికి మైలవరం మండలంలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న కర్మలవారిపల్లె వద్ద బస చేస్తారని, 15 న ఉదయం దాల్మియా ప్లాంట్ కు శంఖుస్థాపన అనంతరం ప్రొద్దుటూరులో టిడిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సాయంత్రం కడప ఎయిర్పోర్ట్ నుండి అమరావతి బయలుదేరి వెళతారని భూపేష్ రెడ్డి వివరించారు.

ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మునిశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జబివుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు డా. నజిముద్దీన్, అధికార ప్రతినిధిమన్సూర్ అక్బర్, పార్లమెంట్ మీడియా కో ఆర్డినేటర్ జనార్దన్, కడప నగర టిడిపి అధ్యక్షులు మన్సూర్ అలీఖాన్, టిడిపి నేతలు నాయబ్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించిన హోం మంత్రి అనిత



అనకాపల్లి, బిఎన్ఎస్ జూలై 13: జిల్లాలోని సామాన్య ప్రజలు, మహిళలు మరియు బాధితుల సమస్యలను త్వరితగతిన, పారదర్శకంగా పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి హోం మంత్రి సోమవారం ఉదయం ఈ కార్యక్రమంలో పాల్గొని, జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను ఎంతో ఓపికగా, స్వయంగా అడిగి తెలుసుకున్న మంత్రి, అక్కడికక్కడే చట్టపరమైన పరిష్కారం చూపాలంటూ సంబంధిత పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.హోం మంత్రి అనిత మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను అందించడం, శాంతిభద్రతలను కాపాడటమే మా కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అన్నారు. గతంలో ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి కూడా భయపడే పరిస్థితి ఉండేదన్నారు.కానీ నేడు, సామాన్య పౌరుడికి, ముఖ్యంగా మహిళలకు పూర్తి భరోసా కల్పించేలా పోలీసు యంత్రాంగం పనిచేస్తోందని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ఎస్పీ తుహిన్ సిన్హా నేతృత్వంలో పోలీసులు ప్రజలకు ఎంతో జవాబుదారీగా ఉంటూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను నిజం చేస్తున్నారన్నారు.ఈ రోజు ా+=ా కి వచ్చిన ప్రతి అర్జీని నేను, ఎస్పీ స్వయంగా పరిశీలించామని, సివిల్ వివాదాలు, కుటుంబ గొడవలు, సైబర్ మరియు ఆర్థిక మోసాల బారిన పడిన బాధితులకు తక్షణ న్యాయం చేయాలని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు.ప్రజలు ఎవరూ అధైర్యపడొద్దు, మీ వెనుక ప్రభుత్వం, చట్టాన్ని రక్షించే పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయన్నారు.

# 80 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడి

## జనగామ జిల్లా లింగంపల్లిలో అమానుష ఘటన
## నిందితుడి అరెస్ట్-బాధితురాలికి న్యాయం చేయాలని గ్రామస్తులు, మహిళా సంఘాల డిమాండ్

**బిఎన్ఎస్ న్యూస్ జనగామ /చిల్పూర్ జూలై 13:**





జనగామ జిల్లా చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామంలో 80 ఏళ్ల వృద్ధురాలిపై జరిగిన లైంగిక దాడి ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది.గ్రామానికి చెందిన పురుమాని రాజమ్మ అనే వృద్ధురాలు ఆదివారం రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో, అదే గ్రామానికి చెందిన పురుమాని రాజేష్ యాదవ్ అనే యువకుడు ఇంట్లోకి చొరబడి ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు,గ్రామస్తులు ఆరోపించారు.ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.బాధితురాలు అరుపులు వినిపించడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు అక్కడికి చేరుకుని ఆమెను వెంటనే 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారని, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి నిందితుడు రాజేష్ యాదవ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం అతడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, వైద్య నివేదికలు మరియు ఇతర ఆధారాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు.ఈ అమానుష ఘటనపై గ్రామస్తులు, మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. మహిళల భద్రతకు భంగం కలిగించే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.బాధితురాలికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని, వేగవంతమైన విచారణ చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.ఈ ఘటనతో లింగంపల్లి గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, పోలీసులు గ్రామంలో



భద్రతను పెంచి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ & ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలి

## ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల బంద్ ఎబివిపి




నల్లగొండ (బిఎన్ఎస్): రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రేపు నిర్వహించే కళాశాలల బంద్ ను విజయవంతం చేయాలని నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎబివిపి నాయకుడు రమావత్ కోరారు.. నల్లగొండలో మీడియాతో మాట్లాడుతూ ... తెలంగాణ రాష్ట్రంలో విద్యకు ఆధారమైన ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాన్ని ప్రభుత్వం తీసి వేసే కుట్ర చేస్తుందని, గత మూడు సంవత్సరాలుగా 10 వేల కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేయకుండ విద్యార్థులకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు... విద్యార్థులు దోస్త్ ద్వారా అడ్మిషన్లు పొంది కళాశాలల్లో రిపోర్టింగ్ కోసం వెళితే ప్రభుత్వ కళాశాలలు కూడా విద్యార్థుల నుండి ముందే ఫీజు వసూలు చేస్తున్నాయని దీని కారణంగా పేద విద్యార్థులు ఫీజులు కట్టుకోలేక విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ వైఖరిని మార్చుకొని పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.. పెండింగ్ పీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదలకై ఈ నెల 14న తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ మీడియట్ నుండి యూనివర్సిటీ స్థాయి వరకు కళాశాలల బంద్ విజయవంతం చేయాలని కోరారు.

# శంకరాజుపల్లిలో పారిశుధ్యానికి పెద్దపీట

## 9వ వార్డులో డ్రైనేజీ కాల్వల శుభ్రత పనులు ప్రారంభం
## జేసీబీతో పూడిక, చెత్త తొలగింపు -
## - వర్షాకాల సమస్యల నివారణకు ప్రత్యేక చర్యలు

**బిఎన్ఎస్ న్యూస్ శంకరాజుపల్లి, జూలై 13**

శంకరాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తూ 9వ వార్డులో డ్రైనేజీ కాల్వల శుభ్రత పనులను గ్రామ సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ ప్రారంభించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి, పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలను జేసీబీ యంత్రాల సహాయంతో తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. పనులను సర్పంచ్ స్వయంగా పర్యవేక్షిస్తూ అధికారులకు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.డ్రైనేజీ కాల్వలు పూడిపోవడం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండటం, దుర్వాసన వ్యాపించడం, దోమల పెరుగుదలతో ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పారిశుధ్య కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం గ్రామపంచాయతీ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి వార్డులో డ్రైనేజీ కాల్వలను శుభ్రపరచడంతో పాటు చెత్త తొలగింపు, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్తులు కూడా చెత్తను డ్రైనేజీ కాల్వల్లో వేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.9వ వార్డులోని ప్రధాన డ్రైనేజీ మార్గాలను పూర్తిగా శుభ్రపరచి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు




తీసుకుంటున్నామని, అవసరమైతే ఇతర వార్డుల్లో కూడా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి డ్రైనేజీ కాల్వల మరమ్మతులు, శుభ్రత పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు.సర్పంచ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు స్వాగతించారు. చాలా కాలంగా పేరుకుపోయిన చెత్త తొలగిపోవడంతో పరిసరాలు పరిశుభ్రంగా మారతాయని, దోమల బెడద తగ్గి ప్రజారోగ్యానికి మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రేపు చెరువుగట్టులో గిరిప్రదక్షిణ

నల్లగొండ (బిఎన్ఎస్): అమావాస్య సందర్భంగా రేపు నల్లగొండ జిల్లా చెరువుగట్టు లోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నామని విశ్వహిందూ పరిషత్ జిల్లా ధర్మచార్య సంపర్క్ ప్రముఖ్ ఉండ్యాల ప్రకాష్ రెడ్డి తెలిపారు... ఉదయం 6గంటలకు చెరువుగట్టు ప్రారంభం మెట్ల వద్ద నుంచి కొండ చుట్టూ శాస్త్రోక్తంగా గిరి ప్రదక్షిణ నిర్వహించి కొండపైకి పాదయాత్ర ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.. కావున గిరి ప్రదక్షిణ మొక్కలు ఉన్నవారు, రామలింగేశ్వర స్వామి భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున ఈ గిరి ప్రదక్షణలో పాల్గొనీ తమ మొక్కలు చెల్లించుకోవలసిందిగా ఆయన కోరారు...